ఎస్పీకి మొక్క అందజేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఎస్పీని కలిసిన మాజీ మంత్రి

వనపర్తి టౌన్, నవంబర్ 2: ఎస్పీ రావుల గిరిధర్‌ను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా మాజీ మంత్రి ఎస్పీకి మొక్క అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు భేటి అయ్యి పలు అంశాలపై చర్చించారు. మాజీ మంత్రి వెంట జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, జోహె బ్రూస్, సయ్యద్, జమీల్, మాజీ సర్పంచ్ పద్మ, వెంకటయ్య, చిట్యాల రాము, ప్రేమ్ కుమార్, రమేశ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

బీఆర్‌ఎస్ సీనియర్ నేత వెంకట్రామయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ, నవంబర్ 2 : ఆపదలో ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం అలంపూర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట్రామయ్యశెట్టి, నాగేశ్వర్‌రావు ఆరోగ్యం బాగాలేక పోవడంతో వారి బాగుగోలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో మృతిచెందిన ఆనందమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే సానుభూతి తెలిపారు.

నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

• ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, నవంబర్ 2 : తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రైవేట్ పరిశ్రమల్లో ఉపాధి కల్పన కోసం ప్రత్యేక శిబిరాలు చేసి యువతకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్జీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్య, సాంకేతిక విద్యలో ఎంతో ప్రావీణ్యం ఉండి సరైన ప్రోత్సాహం లేక వెనుకబడి పోయే నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకర్లు సానుకూలంగా ఉన్నారని, వారు కల్పించే అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. అవసరమైతే మరో వారం రోజుల్లో మరో కార్యక్రమాన్ని నిర్వహించుకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అన్నదాతలు అధైర్యపడొద్దు

అన్నదాతలు అధైర్యపడొద్దని, ప్రతి గింజనూ కొంటామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మెప్మా, సహకార సంఘం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్య కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 241కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అందులో మహిళా సంఘాలకు 151, సహకార సంఘాలకు 117, మెప్మా ద్వారా రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహేశ్, వైస్ చైర్మన్ కృష్ణయ్య, కౌన్సిలర్లు, బ్యాంకర్లు, బ్యాంకు మేనేజర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మహిళా సంఘాల నేతలు ఉన్నారు.

పేదింటి ఆడపడుచులకు అండగా ప్రభుత్వం

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

• ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, నవంబర్ 2 : పేదింటి ఆడపడుచులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కేటీదొడ్డి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, గడ్డంకృష్ణారెడ్డి, రామన్‌గౌడ్, రమేశ్‌నాయుడు, రాజారెడ్డి, కృష్ణ, ఆంజనేయులు, చక్రధర్, తిమ్మప్ప, చిన్నయ్య, కిరణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను
★ ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో టీమ్ లీడర్స్‌గా మహబూబ్‌నగర్ మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పని చేయుటకు M/F కావలెను. అర్హత 10th ఆపై, వయస్సు: 25 ఆపై. సంప్ర॥ సెల్: 9393055164.
MBNR NT-331513

WANTED
★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి కంటే డబ్బే ముఖ్యం

• అవినీతి అధికారికి వత్తాసు
• మాజీ ఎంపీపీ కృష్ణానాయక్
• సివిల్ సప్లయ్ శాఖలో

అవినీతిపై ఆధారాలతో వెల్లడి

ఖిల్లాఘణపురం, నవంబర్ 2 : జిల్లాలో సివిల్ సప్లయ్ శాఖలో అవినీతి తాండవం కొన సాగుతున్నా కాంగ్రెస్ నాయకులకు మాత్రం అభివృద్ధి కంటే డబ్బే ముఖ్యంగా ముందుకు సాగుతున్నారని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సామ్యానాయక్ ఆరోపించారు. మండలకేంద్రంలో వారు శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సివిల్ సప్లయ్ అధికారి ఇర్ఫాన్ జిల్లాలోని 173 రైస్‌మిల్లులను పర్యవేక్షిస్తూ ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు కేటాయిస్తూ జిల్లాలో ఉన్న వివిధ గోదాంలకు తరలించాల్సి ఉంటుందన్నారు. ఈ బియ్యాన్ని పాస్ చేయడానికి ధాన్యంలో ఎలాంటి లోపం లేకుండా ప్రభుత్వం తీసుకునేందుకు ఈయన అజమాయిషి ఎంతో అవసరం. అలాంటి సమయంలో ఒక ఏసీకేకు రూ.10వేల నుంచి రూ.15వేల లంచం తీసుకుంటున్నారని వివిధ రైస్ మిల్లర్ల ఓనర్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. నల్గొండ జిల్లాలో ఇర్ఫాన్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ అక్కడ సస్పెండ్ అయ్యారని ఆయనను మన జిల్లా నాయకులు బదిలీపై తీసుకొచ్చారని, బదిలీపై రావడానికి లంచంగా ఇచ్చిన డబ్బును మిల్లర్లతో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత జూలై నుంచి సెప్టెంబర్ వరకు 173రైస్ మిల్లులకు ధాన్యం ప్రభుత్వానికి సరఫరా చేసేందుకు టెండర్ల ద్వారా మూడు క్లస్టర్లుగా విభజించారని, అందులో ఖిల్లాఘణపురం క్లస్టర్‌కు సాయిచరణ్‌రెడ్డి, గోపాల్‌పేటకు కిచ్చారెడ్డి బినామీల పేరుతో ట్రాన్స్‌ఫోర్ట్‌ను దక్కించుకున్నారని, పెబ్బేరులో మాత్రం పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. అభివృద్ధిపై మక్కువ ఉన్న నాయకులు ఎందుకు ఈ ట్రాన్స్‌పోర్ట్‌లో తలదూర్చారని ఆరోపించారు. ఇంత అవినీతి ఆరోపణలు ఉన్న ఇర్ఫాన్‌కు ఎందుకు వత్తాసు పలుకుతారని ప్రశ్నించారు. అతడు చేసిన అవినీతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వెనుకేసుకొస్తున్నారన్నారు. డబ్బులిచ్చి వచ్చిన వ్యక్తికి డబ్బులు వసూలు చేసుకోమని కాంగ్రెస్ నాయకులే చెప్పారా అని అనుమానం వ్యక్తమవుతున్నదన్నారు. ఈ విషయమై అతడిపై చర్యలు తీసుకోకుంటే బీఆర్‌ఎస్ తరపున పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ , జెడ్పీటీసీ

చిన్నారెడ్డికి విన్నపం..

కాంగ్రెస్ పార్టీలో సౌమ్యుడు, నమ్మకమైన వ్యక్తి అంటే అది కేవలం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డినే , జిల్లాలో ఇంత అవినీతి జరుగుతున్నా ఆయన మౌనం వీడి జిల్లాలో అవినీతి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. జిల్లాలో మొత్తం 1008 ఏసీకేలకు గానూ ఇప్పటికే ఒక్కొక్క ఏసీకేలకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఈ విషయం తెలిసి కూడా చిన్నారెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇప్పటికైనా ఆయన స్పందించి అవినీతి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ సర్పంచ్ పీనానాయక్, మన్నెంగౌడ్, మాజీ ఎంపీటీసీ గోపాల్, లక్ష్మణ్‌నాయక్, నరేశ్, ఆంజనేయులు గౌడ్, బాలరాజు, భరత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

• కలెక్టర్ సంతోష్

గద్వాల, నవంబర్ 2 : జిల్లాలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. శనివారం రాష్ట్రపౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని ఏ చిన్న సమస్య తలెత్తకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా కలెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. సన్నరకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. అనంతరం కలెక్టర్ సంతోష్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో రూపొందించిన ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. దొడ్డురకం, సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాకుండా చూడాలన్నారు. జిల్లాలో రైస్ మిల్లర్లు తాలు, తేమ పేరుతో ఎటువంటి ధాన్యం కోతలు చేయవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యతా ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ఎటువంటి నష్టం రావడానికి వీలు లేదన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంక్ గ్యారెంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసినందునా వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు బ్యాంక్ గ్యారెంటీ అందజేయని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు అవసరం మేరకు గోడౌన్‌లను సిద్ధం చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48గంటల్లో రైతులకు చెల్లింపులు పూర్తి అయ్యేలా చూడాలని చెప్పారు. పక్కరాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా బార్డర్ చెక్ పోస్టుల వద్ద కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, అధికారులు స్వామికుమార్, విమల, ప్రసాదరావు, సక్రియనాయక్ పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..

• వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, నవంబర్ 2: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం వరి కొనుగోలు అంశంపై రాష్ట్ర ఎడ్యుకేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివిధ శాఖల సెక్రటరీలతో వీసీ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులు కష్టపడి పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేసేలా వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. సన్నరకం ధాన్యానికి బోనస్ క్వింటాకు రూ.500 చెల్లిస్తారని, అందుకు దొడ్డు, సన్న రకాల కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని, మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు భారీగా పెంచుతున్నట్లు చెప్పారు. మిల్లర్ల నుంచి బ్యాంక్ అండర్‌టేకింగ్ అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాన్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతులు వ్యవసాయ విత్తన అధికారుల సూచనలు పాటించి కోతలు చేపట్టాలన్నారు.

ఉపాధ్యాయులందరికీ శిక్షణ..

కుటుంబ సర్వేలో పాల్గొనే ఉపాధ్యాయులందరికీ సోమవారం శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఇంటింటి సర్వేలో ఉపాధ్యాయుల పాత్ర, డేటా ఎంట్రీపై అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులందరికీ సోమవారం తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోల ఆధ్వర్యంలో మండలస్థాయి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులకు ఎన్యూమరేషన్ బ్లాక్‌ను కేటాయించే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. అదేవిధంగా సర్వే ప్రారంభమైన తర్వాత డేటా ఎంట్రీ కూడా పకడ్బందీగా వేగంగా చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, డీఎం ఇర్ఫాన్, తాసిల్దార్ కిషన్, సిపీవో భూపాల్‌రెడ్డి, మార్కెట్ శాఖ అధికారి స్వరణ్‌సింగ్, డీపీఎం అరుణ, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

చిట్టి డబ్బులు ఇవ్వడం లేదని హత్య

వనపర్తి టౌన్, నవంబర్ 2 : జిల్లాకేంద్రంలోని చిట్యాల సమీపంలో జిల్లా కేంద్రానికి చెందిన రాములు అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన తెలిసిందే. రాములు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసుకొని సీఐ కృష్ణయ్య నేతృత్వంలో పట్టణ ఎస్సై హరిప్రసాద్ దర్యాప్తు ప్రారంభించారు. ఎస్సై కథనం ప్రకారం మేరకు సీసీ కెమెరాల ఆధారంగా అంకూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా మృతుడు రాములు తనకు చిట్టి డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో, అతడిని చిట్యాల గ్రామ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి చిట్టి డబ్బులు ఇవ్వాలని అడుగగా తనపై దాడికి యత్నించగా గొంతు నులిమి చంపానని శ్రీనివాస్‌రెడ్డి నేరం ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని డీఎస్పీ వెంకటేశ్వరరావు ఎదుట ప్రవేశపెట్టి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు. పట్టణానికి చెందిన రాములు (37) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు.

నీటిగుంటలో పడి వ్యక్తి మృతి

ఖిల్లాఘణపురం, నవంబర్ 2 : నీటిగుంటలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మానాజీపేటలో శనివారం చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్‌గౌడ్ కథనం ప్రకారం మండలంలోని మానాజీపేటకు చెందిన సామల నాగరాజు (47) శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడని మధ్యాహ్నం గ్రామానికి చెందిన సాలె మల్లేశ్ నాగరాజు భార్యకు ఫోన్‌చేసి వారి పొలం దగ్గరలో ఉన్న నీటిగుంటలో చనిపోయి పడి ఉన్నాడని తెలుపగా వెంటనే అక్కడికి చేరుకున్నదని చెప్పారు. ప్రమాదవశాత్తు నీటిగుంటలో పడి చనిపోయాడని భర్త మరణంపై ఎవరి మీద ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదు చేసిందని, ఫిర్యాదు మేరకు చట్టపరమైన తగు చర్య నిమిత్తం ఫిర్యాదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

రామాంజనేయులు(ఫైల్)

గద్వాల రూరల్, నవంబర్ 2 : మండలంలోని సోలార్ ప్లాంట్ సమీపంలో శనివారం విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం గుంటిపల్లి గ్రామానికి చెందిన గోవిందమ్మ, పెద్ద ఆంజనేయుల కుమారుడు రామాంజనేయులు(18) శనివారం మేకలకు మేత తీసుకురావడానికి సోలార్ ప్లాంట్ సమీపంలోకి వచ్చాడు. అక్కడ చెట్టు ఎక్కి మేకలకు మేతను తీస్తుండగా చెట్ల కొమ్మల మధ్య సోలార్ పవర్ సరఫరా అయ్యే వైర్లు ఉండటం గమనించకపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే చెట్టునుంచి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సోలార్ పవర్ ప్రాజెక్ట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అక్కడ యాజమాన్యం లేక పోవడంతో గ్రామస్తులు ఎంత సేపు నిరసన వ్యక్తం చేసిన స్పందనలేక పోవడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. రెండు రోజుల్లో వచ్చి మాట్లాడుతామని చెప్పడంతో మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం చేశారు. పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీక్లీ పరేడ్‌తో ఫిజికల్ ఫిట్‌నెస్

• ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, నవంబర్ 2 : వీక్లీ పరేడ్‌తో పోలీస్ సిబ్బంది ఫిజికల్ ఫిట్‌నెస్ కలిగి ఉంటారని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని నూతన పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లాలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్, హోంగార్డు సిబ్బందికి శనివారం వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్‌కు ఎస్పీ హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్ , స్క్వాడ్ డ్రిల్, సిబ్బంది ప్రదర్శనని ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమయం దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యమని, ఫిట్‌నెస్ అనునిత్యం కాపాడుకోవాలన్నారు. ఇతర సమస్యలు ఉంటే పై ఆఫీసర్లకు చెప్పుకునే వీలుటుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వ్యాయామాన్ని నిత్య జీవితంలోనూ భాగం చేసుకోవాలన్నారు.

హోంగార్డ్‌ల సంక్షేమానికి కృషి చేస్తాం..

హోంగార్డ్‌ల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామని ఎస్పీ అన్నారు. హోంగార్డ్ సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ త్వరలో అందజేసేలా చూస్తామన్నారు. రెయిన్ కోట్స్, హెల్త్ కార్డుల గురించి ఉన్నతాధికారులకు ప్రపోజల్స్ పంపించామని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. హోంగార్డ్ సిబ్బందికి విధి నిర్వహణలో కానీ వ్యక్తిగతంగా కానీ ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలపాలని సూచించారు. ప్రతి శనివారం పరేడ్ నిర్వహించినప్పుడు, మీ సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు వెంటనే తెలపాలని సూచించారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించే వారిని గుర్తించి రివార్డులు, అవార్డులు అందజేస్తామని తెలిపారు. పరేడ్ కార్యక్రమంలో సాయుధ దళాల అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పలనాయుడు, సాయుధ దళ పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్, అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

ప్రాణాలను తీసే ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దు

పరిశ్రమ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రాజోళి, నవంబర్ 2 : ఇథనాల్ పరిశ్రమను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాలని చూస్తే సహించేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట స్వామి అన్నారు. శనివారం పెద్ద ధన్వాడలో పర్యటించి ఫ్యాక్టరీ ఏర్పాటుతో జరుగుతున్న నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమకు 27 ఎకరాలు సేకరించి, అందులో ఆరెకరాల 29గుంటలు మాత్రమే నాలా పర్మిషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ద్వారా తీసుకున్నారని తెలిపారు. పరిశ్రమ నిర్మాణ భూమి పక్కన దళితుల భూములున్నాయని, అంతేకాకుండా పంట పొలాలు నాశనమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యర్థాలతో ప్రజల ప్రాణాలకు సైతం ముప్పు ఉందని, వెంటనే పరిశ్రమ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు దేవదాసు, రాజు, పరం జ్యోతి, రమేశ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాసీల్దార్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గట్టు, నవంబర్ 2 : ఇటిక్యాల తాసీల్దార్‌పై దాడిచేసిన ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాచర్ల ప్రకాశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం గట్టులో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల మెజిస్ట్రేట్ ఫిర్యాదు చేసినా ఎస్సై కేసు నమోదు చేయకపోవడం చూస్తుంటే సామాన్యుడి పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. అణగారిన వర్గాలపై అగ్రవర్ణాల దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బాధ్యులపై చర్య తీసుకోకుంటే ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. తాసీల్దార్‌పై దాడిని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏసన్న మాదిగ ఖండించారు. చట్టాలు బలమున్న వారికి చుట్టాల వుతుండడం చూస్తుంటే వ్యవస్థ ఎక్కడిపోతుందో అర్థంకావడం లేదని వాపోయారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ టీం జిల్లా అధ్యక్షుడు బండారి సునంద్, ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గట్టు మండల కన్వీనర్ బలి గేమోజెస్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాచర్ల ప్రకాశ్

ప్రాథమిక పాఠశాలలపై వివక్ష తగదు

వనపర్తి టౌన్, నవంబర్ 2 : కుల గణన విధుల కేటాయింపునకు కేవలం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను నియమించడం ప్రాథమిక ప్రాథమిక పాఠశాలలపై వివక్ష చూపడమేనని డీటీఎఫ్ జిల్లా నాయకులు యోసేపు అన్నారు. జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట డీటీఎఫ్ నేతలతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. పాఠశాలలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నడపడం అంటే విద్యార్థుల తల్లిదండ్రులు నిరాశకు, నిరాధరణకు గురయ్యే ప్రమాదం ఉందని, పిల్లల సంఖ్య తగ్గడానికి అవకాశం ఉందన్నారు. ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను 50:50 నిష్పత్తిలో సర్వే విధుల్లోకి తీసుకుంటే పాఠశాలకు నష్టం జరగదన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలు, హెచ్‌ఎంలకు కుల గణన విధులను జారీచేసిన ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు.

ఇసుక లారీ పట్టివేత

అయిజ, నవంబర్ 2 : అనుమతి లేకుండా హైదరాబాద్‌కు లారీలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఉండవెల్లి ఏఎస్సై సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. ఏపీలోని కర్నూల్ జిల్లా వెల్దుర్తి నుంచి లారీలో హైదరాబాద్‌కు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా, ఉండవెల్లిలో పోలీసులు రవి, మద్దిలేటి పట్టుకొని స్టేషన్‌కు తరలించారన్నారు. లారీ డ్రైవర్ శ్రీనును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అయిజ, నవంబర్ 2 : అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి ప్రైవేట్ పాఠశాలలో వంటశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటస్వామి కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లా గోనెగండ్ల మండలం కులుమాల గ్రామానికి చెందిన రామాంజనేయులు గౌడ్(41) 15 ఏండ్లుగా అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో భార్యతో కలిసి వంటమనిషిగా పనిచేస్తున్నాడు. పాఠశాలలోనే ఇద్దరు పిల్లలకు విద్యాభ్యాసం చేయిస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. శుక్రవారం వంట గదిలో రామాంజనేయులు గౌడ్ గ్రైండర్ వేస్తున్న క్రమంలో స్పృహ తప్పి పడిపోయాడని భార్యకు సమాచారం అందించారు. వెంటనే పాఠశాల యాజమాన్యం అతడిని ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావడంతో పాఠశాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడి కుటుంబానికి పాఠశాల యాజమాన్యం భారీ మొత్తంలో ఆర్థిక భరోసా కల్పించినట్లు గుసగుసలు వినిపించాయి.

రోడ్డు ప్రమాదంలో ..

ధరూరు, నవంబర్ 2 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై అబ్దుల్ షుకూర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ధరూరు మండల కేంద్రానికి చెందిన కుర్వ పరశురాముడు, అతని స్నేహితుడు స్వామి కలిసి బైక్‌పై శుక్రవారం రాత్రి పదిగంటల సమయంలో కేటీదొడ్డికి వెళ్లారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో అల్వాల్‌పాడ్ వద్ద ధర్మారెడ్డి పొలం వద్ద వాహనం అదుపుతప్పి కింద పడి పోగా పరశురాముడు, స్వామికి గాయాలు కాగా ఇద్దరిని దవాఖానకు తరలించగా పరశురాముడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్వామిని మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. పరుశురాముడు తండ్రి వీరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

అయిజ, నవంబర్ 2 : మండలంలోని మేడికొండ జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి చదువుతున్న శైలజ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 1వ తేదీన వనపర్తి జిల్లా పెబ్బేరు జెడ్పీహెచ్‌ఎస్‌లో అండర్- 17 ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి ఈనెల 3,4,5 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తిమ్మారెడ్డి, పీడీ జగదీశ్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని అభినందించారు.

పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి

గద్వాల అర్బన్, నవంబర్ 2 : పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ,జడ్జి గంట కవితాదేవి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ప్రహరీ, కిటికీలు, స్నానపు గదులు, శుభ్రత తదితర విషయాలపై ఆరా తీశారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

పోలీసుల చెంతన బాలుడు

గద్వాల అర్బన్, నవంబర్ 2 : రెండేళ్ల వయస్సు బాలుడు తప్పిపోగా జిల్లాకేంద్రంలోని చేపల మార్కెట్ వద్ద దొరికిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్ కుమార్ కథనం ప్రకారం జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్ వద్ద రెండేళ్ల బాలుడు ఏడుస్తూ కన్పించడంతో బాలుడిని చేరదీసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. బాలుడికి తల్లిదండ్రుల కోసం ఆరా తీశారు. ఈ ఫొటోలో ఉన్న బాలుడిని ఎవరైనా గుర్తిస్తే గద్వాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.